# శేషప్రశ్నలు

నిశ్శబ్దంగా ఆమె మంచం దగ్గర నుంచుని, ఆమెని చూశాను. మెడవరకూ తెల్లటి దుప్పటి. ఆపైన మొహం తప్ప మిగతా చోట్ల తెల్లటి బాండేజీలు. రెక్కలు చెదిరి, పడిపోయిన హంసలా ఉంది.

చేతిలో ఉన్న షీటుని చూశాను.

పేరు చిత్ర. వయసు ఇరవై ఎనిమిది. వివాహిత. భర్త పేరు వినీత్. చిట్లిన నుదురు, తలవెనక భాగం, కమిలి పోయిన చెంపలు, ఒంటిమీద గాయాలతో, రక్తంతో తడిసిపోయిన బట్టలతో, స్పృహలేని స్థితిలో, అర్ధరాత్రి పన్నెండు గంటల పదినిమిషాలకి, ఆమె భర్త అడ్మిట్ చేశాడు.

తేదీ చూసింది. అంటే మొన్న రాత్రి అన్నమాట. చిన్నగా నిట్టూర్చి, గ్లూకోజ్ బాటిల్ మార్చాను.

ఆమె కదిలింది, ఆ శబ్దానికి.

ఆల్చిప్పల్లాంటి, తెల్లని కళ్ళని నావైపు తిప్పి చూసింది. వాటినిండా నీళ్ళు. జారడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆ చూపులో ఎన్నో ప్రశ్నలు.

అభిమానం నేల జారిపోతూంటే, అన్యాయం జరిగి పోతూంటే, ఆవేదనతో, నిస్సహాయ స్థితిలో పుట్టే ప్రశ్నలు అవి. యుగయుగాల నుంచి గాయపడ్డ హృదయం మీద, ఆడది తన్ను తాను ప్రశ్నించుకుంటూ, రాసుకున్న ప్రశ్నలు అవి.

అవన్నీ కూడా, యుగాల నుంచి వస్తున్న ప్రశ్నలు కాబట్టి, జవాబులు కూడా అప్పట్నించి ఉన్నవే. జవాబులు తెలిసినా ఇచ్చే ధైర్యం ఉన్నవాళ్ళు తక్కువ. తెలిసిన జవాబులు రాసి పాసయ్యే వాళ్ళెంత మంది? దీనికి జవాబు లేదు.

"ఎప్పుడూ ఇంతేనా!"

ఆ కళ్ళల్లో తడబాటు. కళ్ళల్లోని భావాలు కనిపించనివ్వడానికిష్టపడలేదు. కళ్ళు తిప్పి తిరుగుతున్న ఫ్యాన్ వైపుగా చూస్తోంది. కను చివళ్ళ నుంచి, నీటి బొట్లు జారి, జుట్టులో కలిసిపోవడానికి ప్రయత్నం చేస్తోంది.

జరిగింది దాచడానికి ఆమె చేస్తున్న ప్రయత్నం ఫలించలేదన్న విషయం మా ఇద్దరికీ తెలుసు. భర్త చేసిన దాష్టీకం, అవమానం చెప్పుకోలేని దౌర్భాగ్యపు బలహీనత ఆమెను ఆవరించింది. కళ్ళు మూసుకున్నా, చెవులవైపుగా జారుతున్న కన్నీళ్ళు.

విరిగిపోయిన పాలల్లాంటి అనుభవం వల్ల ఆస్పత్రిలో చేరింది. విరిగిపడ్డ కొండచరియలాంటిది కనిపిస్తున్న భౌతిక హింస.

బాగా చదువుకున్న దానిలా ఉంది. సొంత అభిప్రాయాలుండచ్చు. సొంత ఆలోచనలుండచ్చు. సొంత వ్యక్తిత్వం ఉండచ్చు. అందుకని, వెన్నెముకని నిటారుగా ఉంచడానికి చేసే యత్నాలకి జవాబులిలా ఉంటాయన్న సంగతి నాకు బాగా తెలుసు. ఎన్నో కేసులు చూశాను.

కళ్ళెత్తకుండా, హక్కుల్ని, ఇష్టాల్ని, మనసుని ఆఖరికి ఆత్మని కూడా ఇచ్చేసి, ప్రతీదానికి గంగిరెద్దులా తలూపు తుంటే ఇలాంటి ఎపిసోడ్స్ ఉండవు.

అక్కడి నుంచి వెళ్ళి, నా కౌంటర్ దగ్గర కూచున్నాను. పిల్లల స్కూలు ఫీజు, పుస్తకాలు, యూనిఫారం కోసం మర్నాడు ఆఫ్ తీసుకుని వెళ్ళాను స్కూలుకి.

ఆ మర్నాడు పొద్దున్న ఎనిమిదింటికి డ్యూటీ కొచ్చాను. నైట్ డ్యూటి సిస్టర్స్ నుంచి మేం చార్జ్ తీసుకుంటున్నాం.

ఆ ఫ్లోర్‌లో ఉన్న పేషెంట్ల కేస్ షీట్లు చూస్తూ ఏ పేషెంటుకి ఏమందు ఎప్పుడు ఇవ్వాలి! డాక్టరు రాసిన మందులు మా దగ్గర ఉందో లేదో, ఫార్మసీ లోంచి తెప్పించాలా అని మేము మాట్లాడుకుంటూంటే,

గంటి పద్మావతి

బూట్లు టకటక లాడించుకుంటూ మా కౌంటరు దగ్గరికొచ్చి ఆగాడు అతను.

అర్ధచంద్రాకారంలో వున్న మా కౌంటర్‌కి ఆవల ఉన్న అతన్ని చూశాం.

అందంగా, నీటుగా, టైతో, నల్లకళ్ళజోడుతో ఉన్న ఓ ముప్పయ్యేళ్ళ వ్యక్తి కౌంటర్ మీద చేయి ఉంచుతూ మా వైపు చూశాడు.

ఏం కావాలన్నట్లుగా కళ్ళెత్తి చూశాం.

''నేను మూడువందల మూడులోఉన్న పేషెంటు భర్తని. ఆమె ఎలా ఉందో, ఇంటికి తీసుకెళ్ళచ్చా అని అడగడానికి వచ్చాను...''

నా కళ్ళముందు చిత్ర మెదిలింది.

''డాక్టరు గారు థియేటర్‌లో ఉన్నారు. పన్నెండు గంటలకి అందరిని చూడ్డానికొస్తారు. అప్పుడాయన్ని కలుసుకుని మాట్లాడండి... అయినా... మీ భార్యకి అన్ని గాయాలెలా అయ్యాయి! తల వెనక, నుదుటి మీద రెండు చోట్ల కుట్లు పడ్డాయి... అలా ఎలా జరిగింది?...''

అనుకోని ప్రశ్నకి తత్తర పడ్డాడు.

''ఆఫీసు నుంచి వచ్చాక, బాత్రూంలో స్నానం చెయ్యడానికి వెళ్ళింది. అక్కడ జారి పడడంతో నల్లా, బక్కెట్టు, ఓవైపుగా ఉన్న వాష్ బేసిన్ తగలడంతో...'' ఆపి నా వైపు చూశాడు.

నా మొహం చూస్తే, నేను నమ్మడం లేదనిపించిందేమో...

''సరే... మధ్యాహ్నం వచ్చి కలుస్తాను'' అని వెళ్ళిపోయాడు.

## మినీకవితలు

అక్షరాల ఇటుకలతో భావాల సిమెంట్
కలిపి
కవితల కోవెల కట్టాను
అక్షరాలా చదువులమ్మే
జ్ఞానధనం వరమిచ్చింది

బియ్యానికి నీళ్ళు కలిస్తే
అన్నం
చెలిమికి నమ్మిక తోడైతే
పరమాన్నం

వై.కె.మూర్తి

## తల్లి

ఎన్నో
ఈదురుగాలులకు
ఎదురొడ్డి
నిల్చేది చెట్టుతల్లి
ఎన్నో
ఈతి బాధలకు
ఎదురొడ్డి
లాలించేది అమ్మ తల్లి!

శైలజ

అన్నట్లుగానే పన్నెండు గంటలకి చిత్ర భర్త వినీత్ వచ్చాడు. డాక్టర్ రామ్మోహన్ రావుగారిని కలిశాడు. మేం ఉన్న దగ్గరే మాట్లాడుకుంటూంటే నేనన్నీ విన్నాను.

''ఈ నాలుగు రోజుల్లో పైకి కనిపించే గాయాలు మానిపోయాయి... కానీ... లోపలి గాయాలు...! దానికి నా అవసరం లేదు. మరో డాక్టరు అవసరం ఉంది. అందుకని మీ భార్యని సైకియాట్రి వింగ్‌కి రెఫర్ చేశాం. డాక్టరు రామనాధంగారు చూస్తున్నారు. అసలు రామనాథం గారు మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు. మ్యారేజి కౌన్సిలింగ్ చేస్తానన్నారు. సాయంత్రం ఆయన్ని కలవండి. ఆరు నుంచి ఏడు వరకూ ఇక్కడుంటారు...'' బుద్ధిగా తలూపి డాక్టరు రామనాథంగారి ఫోన్ నంబర్లు తీసుకుని ''అప్పాయింట్‌మెంట్ తీసుకుంటాను...'' అని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత రామనాధం గారు వచ్చినప్పుడు అంటూంటే విన్నాను.

''ఒక్కసారి చిత్ర భర్త కలిస్తే బావుంటుంది. భార్యాభర్తలన్నాక కలహాలు, స్పర్ధలు, ఘర్షణలూ ఉంటాయి. అయితే అవి హద్దులు దాటి శతృవుల మధ్య ఉండే వాతావరణాన్ని సృష్టిస్తే ఇలాగే ఉంటుంది పర్యవసానం... అయినా చదువుకున్న వాళ్ళు, ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళ సంసారాలు దెబ్బతింటున్నవి దాంపత్య జీవితాల్లోని లోపాలవల్ల. అందుకే కౌన్సిలింగ్ అవసరం. అయినా ఎంతవరకూ వీళ్ళని తోస్తాం... వాళ్ళ లోపాలేవో వాళ్ళకి తెలీదు. ఇంకోళ్ళ దగ్గర సలహాలు తీసుకోరు... ఈ కాలం వాళ్ళతో వచ్చిన తంటా ఇదే. ఇలా కొట్టుకుంటూ, వీధిన పడ్తూ...'' అంటూ వెళ్ళిపోయారు. వినీత్ డాక్టరుగారిని కలవలేదన్నమాట.

## పనిపిల్ల

తన బాల్యాన్ని
బలి చేసుకొని
విద్యాభ్యాస్యాన్ని త్యాగం చేసి
మా ఇంటి పనులన్నీ
చక్కబెట్టే త్యాగమూర్తి
ఒక్కరోజు రాకున్నా
ఓ పది రూపాయలు ఎక్కువ ఇవ్వాలన్నా
నా చెయ్యి విరిగినట్టే ఉంటుంది!

జోరాశర్మ

రెండు రోజుల తర్వాత తొమ్మిది గంటల ప్రాంతంలో వినీత్ లాయరు వచ్చాడు. సాధారణంగా రామ్మోహన్ రావుగారు ఉదయం పది వరకూ అక్కడ క్కడే తిరుగుతూ ఉంటారు. అందుకని లాయరు గారు వచ్చినప్పుడు ఆయన ఉన్నారు.

"నా క్లయింట్ వినీత్ భార్య చిత్రని మీరు ఇన్ని రోజులుంచుకోడం ఆయనకిష్టం లేదు. వెంటనే ఆమెను డిశ్చార్జి చేసే ఏర్పాట్లు చేయండి... లేకపోతే..."

విసుగ్గా చూశారు ఆ లాయరు వైపు.

"ఇక్కడ అయనిష్టం కాదు. ఆమె ఇష్టప్రకారంగా జరుగుతోంది. ఆమె అనుమతి రాతపూర్వకంగా తీసుకున్నాక సైకియాట్రిస్ట్ దగ్గరికి పంపాం. ఓసారి మీ క్లయింట్‌ని కలవమనండి ఆయన ప్రవర్తన ఎలా ఉండాలో, ఏవిధంగా మలచుకోవాలో ఆయన భార్యతో ఎలా సంతోషంగా మెలగాలో అన్నీ కూడా రామనాథంగారు చెప్తారు. ఈ సంగతే మీ క్లయింట్‌కి చెప్పండి... రమ్మనండి. డాక్టరుని కలుసుకోమనండి"

ఆ తర్వాత, లాయరు రాలేదు. వినీత్ కూడా రాలేదు.

ఓ వారం తర్వాత ఓ రాత్రి ఎనిమిదిన్నర ఆమె గది కెళ్ళాను. రోజూ చిత్ర గదిలోకి ఏదో ఓ పనిమీద వెళ్తూండడంతో, ఆమెతో కొంచెం చనువేర్పడింది.

ఆ చనువుతోనే ఆమె భవిష్యత్తు గురించి అడిగాను.

"అదే ఆలోచిస్తున్నాను. అసలు నేనేమిటో, నా భవిష్యత్తేమిటో వీటిని నిర్వచించడానికే టైము సరిపోవడం లేదు. ఇంకొంచెం సమయం కావాలి..."

నిజమే. టైము సరిపోదు. గాయపడ్డ హృదయం మామూలు అవ్వాలి. అప్పుడు కదా ఆలోచించేది. మరి అన్ని రోజులు ఎలా? ఎక్కడికెళ్తుంది? ఏం చేస్తుంది?

"మీ పేరెంట్స్..."

"అదే ఆలోచనలో ఉన్నాను. అమ్మ ఉంది. నాన్న పోయి నాలుగేళ్ళయింది. తమ్ముడిది బి.కాం అయ్యాక మానాన్న ఆఫీసులోనే ఉద్యోగం ఇచ్చారు. విశాఖపట్నలో ఉంటున్నారు అమ్మవాళ్ళు. నేను అమ్మ దగ్గరికెళ్తాను. ఏం చెయ్యాలి అన్న దానిమీద ఆలోచించుకుంటాను. అమ్మ సలహా తీసుకుంటాను. అమ్మకూడా కుటుంబ హింసకి వ్యతిరేకం అయినా కాకపోయినా నాకు మాత్రం వ్యతిరేకి కాదు. ఆమె నన్నర్థం చేసుకుంటుంది. నాకు అండగా నిలుస్తుంది. తమ్ముడికి నేనంటే ప్రాణం. వాళ్ళమధ్య నేను మామూలు చిత్రని అవుతాను..."

ఆ కళ్ళల్లో మెరుపు.

"సిస్టర్, ఒక్కసారి మా అమ్మతో మాట్లాడండి. నన్ను వచ్చి తీసుకెళ్ళిపోతుంది. నేనిక్కడ ఉండలేనంటే ఎప్పటికీ తనతోనే ఉండి పొమ్మంటుంది. మా అమ్మ మామూలు అమ్మ కాదు. సమాజానికి భయపడదు... మీరు మాట్లాడండి..." అంటూ తన సెల్ నాకిచ్చింది. 'ప్లీజ్' అంది వేడుకొంటున్నట్లుగా.

ఇబ్బందిగా అనిపించింది. మధ్యలో నేనేవిటి? నాకెందుకూ వాళ్ళ గొడవ? మధ్యలో ఇరుక్కుపోతున్నానా?

"హలో..." అవతలనుంచి గొంతు వినపడింది. స్పీకర్‌లోంచి.

"చిత్రా! ఈ మధ్య ఫోన్ చెయ్యడలేదేం? బిజీగా ఉన్నావా?...." నేను వెంటనే అందుకున్నాను.

"నేను చిత్రని కానండి. శుశృతా హాస్పటల్స్ నుండి సిస్టర్‌ని మాట్లాడుతున్నాను..." చిత్ర ఓ అర్ధరాత్రి అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో ఎలా చేరిందో అన్నీ వివరంగా చెప్పి... "మీ అమ్మాయి ఇంతవరకూ కేసు పెట్టలేదు..."

వెంటనే ఆమె అనేసింది. "థ్యాంక్ గాడ్, ఆమెకా ఆలోచన రానందుకు... నేను వెంటనే బయలుదేరి వస్తున్నాను..."

మర్నాడు సాయంత్రం పేషెంట్లు తాలుకు బంధువులతో ఫ్లోర్ అంతా, నిశ్శబ్దంగానే హడావుడిగా ఉంది.

కాంటీన్‌కెళ్ళి కాఫీ తాగి వస్తూంటే, చిత్ర గదిముందు ఓ యాభైఏళ్ళ స్త్రీ పెద్ద జరీ చీరతో, భుజాన ఓ బ్యాగ్‌తో నుంచుని ఉంది.

ఆమెను చూస్తూ, చిత్ర గదిలోకి వెళ్ళాను. ఆమె నా వెనక్కాలే వచ్చింది.

"నేను చిత్ర తల్లిని. నిన్న రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో మీరే కదా నాకు ఫోన్ చేసింది. అమ్మాయిని

ఇప్పుడు తీసుకెళ్ళిపోతాం.... డబ్బెంతయిందో చూసి, బిల్లు ఇవ్వండి...''

చిత్ర తల్లి పోలిక అని అనుకుంటూ ఆమెను చూస్తున్నాను.

''డాక్టరు గారు చిత్ర డిశ్చార్జి విషయం ఏం రాయ లేదు... ఆ చివర గదిలో ఉన్నారు... మీరు కలిసి మాట్లా డండి...''

ఆమె వెంటనే వెళ్ళిపోయింది.

నేను చిత్రని చూశాను.

ఆమెలో సంతోషం పెద్దగా లేదు. ''మా అమ్మ వచ్చేసింది. ఏదో డిసైడ్ చేస్తుంది... మీకు థ్యాంక్స్... ఓ అక్కలాగా, ఆత్మీయంగా మాట్లాడారు...''

''మా డ్యూటీ అదే కదా!....'' చిరునవ్వుతో అన్నాను.

''ప్రతి సమస్యకి పరిష్కారం దొరుకుతుంది. అయితే ఒక్కొక్కసారి వెంటనే. మీ విషయంలో అదే జరుగుతోంది. అంతా మంచే జరుగుతుంది...'' ఈ లోపల డాక్టరు రామ్మోహన్ రావుగారు వచ్చారు. ఆయన వెనకాలే చిత్ర తల్లి, ఓ యువకుడు.

''మీ అమ్మాయిది డొమెస్టిక్ వయెలెన్స్ కేస్. ఆమె ఇంకా కేసు పెట్టలేదు. వచ్చిన రోజున నాలుగు చోట్ల కుట్లు వేశాను. కేసుని సైకియాట్రి విభాగానికి పంపాం. ప్రస్తుతం చిత్ర డాక్టర్ రామనాథంగారి దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకుంటోంది. అందుకని ఆయన్ని కూడా అడగండి... ఇప్పుడాయన కింద కన్సల్టింగ్ రూంలో ఉంటారు.ఓసారి రమ్మనమంటాను...'' అంటూ రామ్మోహన్ రావుగారు సెల్‌లో రామనాథంగారిని పిలిచారు.

''రామనాథం గారిని అడగాల్సిన పనేం లేదు. దానికేం పిచ్చి ఎక్కలేదు. మీరు సైకియాట్రిస్ట్ దగ్గర దానికి ట్రీట్ మెంట్ ఇప్పించాల్సిన పనిలేదు. నాకు ఈ సైకియాట్రిస్టుల మీద నమ్మకం లేదు. వాళ్ళుత్త మాటల డాక్టర్లు. ఏవేవో ప్రశ్నలు వేస్తారు.

అసలిప్పటికే దాని మనసు పాడు చేశారు. సంసారం అన్నాక సవాలక్షలుంటాయి. ఓసారి అనుకుంటారు, కలుసుకుంటారు. వాళ్ళే సర్దుకుంటారు. అంతే కానీ, చిన్న చిన్న గొడవల్ని భూతద్దంలోంచి భయంకరంగా చూపించి, ఇంతని కొండంత చేస్తారు...''

చిత్ర తల్లిని ఆశ్చర్యంగా చూశాను. ఈమె ఇలా అంటోందేవిటి? ఈమె మీద చిత్ర ఎన్నో ఆశలు పెట్టు కుంది. ఇప్పుడేం చేస్తుంది. తల్లితో వివాఖపట్నం వెళ్ళి, అక్కడ ఆలోచిస్తుందా! ఆమె ఆలోచనలు తల్లి మాటలు విన్నాక దిశ మారుతుందా! లేకపోతే మొద్దుబారిన

## జ్ఞానోదయం

శ్రమ జీవన
సౌందర్యమంటే ఏమిటో
చీమను చూశాకే
నాకర్థమయింది

ఆర్తిగొన్న బాటసారికి
నీడనిచ్చిన కరువును చూశాకే
పరోపకారమంటే ఏమిటో
నాకర్థమయింది

పసిపాపగొంతుకలాగ
పాలుపోసిన గోవును చూశాకే
మాతృత్వమంటే ఏమిటో
నాకర్థమయింది

ఎండిన బీళ్ళపై చినుకుల్ని
చిలకరించిన మేఘాన్ని చూశాకే
మానవత్వమంటే ఏమిటో
నాకర్థమయింది

సి. కామేశ్వరరావు

బుర్రతో ఆలోచించడమే మానేస్తుందా!

రామనాథం గారు వచ్చారు. సంగతి తెలుసుకున్నారు. భుజాలెగరేసి పెదవి విరిచారు.

''మీ ఇష్టం వెళ్ళాలనుకుంటే వెళ్ళచ్చు. అసలు సమస్య ఏవిటో ఎక్కడుందో, దాని మూలకారణం ఏవిటో తేల కుండా, పరిష్కారం కాకుండానే చిత్ర వెళ్ళిపోవడం బాగు లేదు. అసలామె భర్త వెర్షన్ ఏవిటో తెలీదు. అసలాయన ఏం చెప్పదల్చుకున్నదో, ఆయన జవాబులేవిటో చిత్ర ఎదురుగా చెప్పించాలనుకున్నాను...'' అని ఆయన చిత్రని చూశారు.

''అమ్మా! చిత్రా... నీకెప్పుడయినా నన్ను కలవాలని పిస్తే, మాట్లాడాలనిపిస్తే... మా దగ్గరికి రావచ్చు...'' అంటూ ఆయన వెళ్ళిపోయారు.

ఈలోపల చిత్ర తల్లి బట్టలు, సామాన్లు సర్దింది. అరగంటకి బిల్లులన్నీ ఆవిడ చేతికివ్వడం జరిగింది.

''చిన్నా, నువ్వు డబ్బు కట్టేసి... మాకోసం బయట ఆగు. నువ్వు మళ్ళా పైకి రానక్కర్లేదు...'' అని బిల్లులు,

నోట్ల కట్ట చిత్ర తమ్ముడి చేతికిచ్చింది. ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు.

నేను చిత్రనే గమనిస్తున్నాను. పదిరోజుల్నించి ఇక్కడే ఉంది. ఓ సైకియాట్రిస్టు దగ్గర ట్రీట్‌మెంటు తీసుకుంటోంది. ముందు జీవితాన్ని ఏవిధంగా తీసుకోవాలనుకుంటోంది!

ఎలాంటి పరిస్థితినయినా ఎదుర్కోగలను అన్న ధీమా వచ్చిందా? ఆత్మవిశ్వాసం పెరిగిందా? ఆమె వ్యక్తిత్వంలో తేడాని నేను గమనించలేదు, కానీ, మార్పు తప్పనిసరిగా వచ్చి తీరుతుంది. తల ఎత్తి, గడ్డం ముందుకు తోసి, నిటారుగా, ఆమె నడుస్తుంది. నాకు తెలుసు. ఆ మార్పుని రామనాథంగారు తెచ్చి ఉంటారు.

ఎందుకో ఆమె వెళ్తూంటే చూడాలనిపించింది.

నా ముందు నుంచే చిత్ర, తల్లి వెళ్ళిపోయారు.

ఓ ఐదు నిమిషాలయ్యాక, నేను మా ఫ్లోర్ మధ్యలో వున్న పిట్టగోడ దగ్గర నుంచుని కిందకి చూశాను.

విశాలంగా, గుండ్రంగా ఉన్న ఆ పెద్ద హాల్లో, చిత్రని ఆమె తల్లిని గుర్తుపట్టడం, అందులో పై నుంచి కొంచెం కష్టం అయింది.

ఇద్దరూ పెద్ద గాజు తలుపుల ఎంట్రెన్స్ దగ్గరున్నప్పుడు, ఎందుకో ఓసారి ఆమెను చూడాలనిపించింది. గబగబా లిఫ్ట్‌లో దిగి, గాజు తలుపుల వైపుకెళ్ళాను.

వాళ్ళిద్దరూ అప్పటికే ఆస్పత్రిలోకి రావడానికి ఉన్న నల్ల గ్రానైటు మెట్లని దిగి, పెద్ద పెద్ద చిల్లులున్న నల్ల రబ్బరు మ్యాటు మీద నుంచుని ఉన్నారు.

ఇంతలో ఓ తెల్ల మారుతికారు, వేగంగా వచ్చి ఆగింది. ముందు సీట్లోంచి వాళ్ళని దిగి రమ్మన్నట్లు చేయూపాడు.

నేను గుమ్మం దగ్గరున్న పెద్ద ఇత్తడి మండి పక్కగా నుంచుని చూస్తున్నాను. కూతుర్ని కార్లో విశాఖపట్నం తీసుకెళ్తున్న ఆ తల్లి శ్రద్ధని అభినందించాను.

అలాగే నుంచున్న చిత్ర చేయి పట్టుకుని నడిపించి, వెనక తలుపు తీసి, కూచోపెట్టి, తను అటువైపు నుంచి ఎక్కగానే కారు తలుపులు మూసుకున్నాయి.

కిటికీలకి నల్లటి గాజు తలుపులుండడం వల్ల, లోపల మనుషులు కనిపించడంలేదు.

డ్రైవరు కారుని, రెండుసార్లు వెనక్కి, ముందుకీ తీసుకెళ్ళి వచ్చిన దారినే కారుని తీసుకెళ్ళడానికి పెద్ద అర్ధ చంద్రాకారంగా తిప్పుతూ ముందుకి వేగంగా వచ్చాడు.

సరిగ్గా అదే సమయంలో ఎర్రటి సూర్యుడి కిరణాలు డ్రైవరు మీద పడ్డాయి. డ్రైవరు మొహం చాలా క్లియర్‌గా కనపడింది. ఉలిక్కిపడ్డాను.

అతను వినీత్. టోపి పెట్టుకున్నా, సగం టోపి ఓ వైపుకి ఒరిగిపోయినా చాలా సులువుగా గుర్తుపట్టాను.

కారు నడుపుతున్నది వినీత్ అని వెనక కూచున్న చిత్రకి తెలీదు. తెలిస్తే పిచ్చిపట్టినట్లు అరిచేదే.

ఇంటికెళ్ళాక ఏం చేస్తుంది? విధిలేక వినీత్‌తో కాపురం చేస్తుందా? విడాకులకి ప్రయత్నిస్తుందా! ఆ తల్లి మానసికంగా చిందర వందర అయిన చిత్రకి ఏవిధంగా సాంత్వన చేకూరుస్తుంది!

ఏది ఏమయినా కానీ, ఆమె హక్కులేమిటో శక్తులేమిటో నిర్ణయం అయ్యే సమయాన వాటినే వదిలేసుకోడమో, కాపురాన్నే వదిలేసుకోడమో అన్న నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది.

ఆమె మళ్ళా వినీత్‌తో కాపురం చేస్తే, వినీత్‌కి సర్వశక్తులు వచ్చేసినట్టే. గెలిచినట్లే.

ఆ ఇంట్లో, ఆమె భవిష్యత్తు ఎలా ఉంటుంది? ఏం జరగనట్లే ఉండగలదా? అలా ఉండాలంటే నటిస్తుందా? ఆ తర్వాత వినీత్‌తో మాట్లాడిన మాటల్లో, పంచుకున్న క్షణాల్లో, నవ్వుల్లో ఉండే వెలితి ఆమె గమనించగలుగుతుందా? వాళ్ళ సంబంధానికి పునాది ఏమిటి? అది ఎంత మందంగా ఉందో ఆమె గమనించ గలుగుతుందా?

ఎన్నో ప్రశ్నలు-జవాబులు తెలీని ప్రశ్నలు. నాకే కాదు. చిత్రకి కూడా. ఆమె ఒక్కసారి ఆగి, వెనక్కి తిరిగి చూస్తే ఎన్నో ప్రశ్నలు. అడ్డదిడ్డంగా ఉన్న క్వశ్చన్ మార్కులు అన్నింట్లోకి పెద్ద ప్రశ్న.

పెద్ద క్వశ్చన్ మార్కుతో ఉన్న ప్రశ్నలు నాలాంటి వాళ్ళకోసం ఏర్పరిచిన చట్టాన్ని నేనెం దుకు ఉపయోగించుకోలేదు? అప్పుడే కేసెందుకు పెట్ట లేదు? నేను కోర్టుని ఎందుకాశ్రయించలేదు? అన్న ప్రశ్నలు తప్పకుండా ఏదో ఓ రోజున ఆమెను చుడ్తాయి.

ఆమె జవాబుల కోసం చట్టాన్ని తప్పకుండా ఆశ్రయిస్తుందని నాకెందుకో అనిపించింది. ■

## విచారం

అసలే కరువు
ఆపై అరువు
జీవితంలో మిగిలింది
బరువు!

*డి. హెచ్. సంతోషి*